## క్లుప్తంగా

### ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి



పమిడిముక్కల: ఉద్యోగులు వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని తహసీల్దార్ నవీన్‌కుమార్ పేర్కొన్నారు. హనుమంతపురం వీఆర్వో పీవీవీ శ్రీనివాసరావు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జేసీ గీతాంజలిశర్మ నుంచి ఉత్తమ వీఆర్వోగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్‌కుమార్, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సర్వేయర్ మణికుమార్, వీఆర్వోల సంఘం అధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు.

### ఘనంగా విఖనస మహర్షి జయంత్యుత్సవం



గుడ్లవల్లేరు: విఖనస మహర్షి జయంత్యుత్సవాలను గుడ్లవల్లేరులోని ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని గుడ్లవల్లేరు శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వేద పండితుడు రొంపిచర్ల శ్రీనివాసాచార్యులు దంపతులకు స్థానిక బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఏఎస్‌ఎం అండ్ వీవీఆర్‌ఎస్‌ఆర్ హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి, వేద పండితుడు డాక్టర్ అగ్నిహోత్రం ఫణిగోపాల్ పాల్గొన్నారు.

### యోగాసన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గుడివాడ టౌన్: జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించడంతో పాటు జిల్లా ప్రథమ బహుమతి సాధించారని విద్యాలయ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్ సోమవారం తెలిపారు. ఈ నెల 16వ తేదీన విజయవాడ వివేకానంద స్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో తమ విద్యార్థిని లోయ గాయత్రిదేవి జిల్లా ప్రథమస్థానం, ఈడే సాయిపూజితశ్రీ ప్రోత్సాహక బహుమతి పొందారన్నారు.

### వెంకటేశ్వరస్వామి ఆలయంలో సుదర్శన హోమం



పమిడిముక్కల: మంటాడ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం సుదర్శన హోమం జరిగింది. స్వామి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రం సందర్భంగా సుదర్శన హోమం చేశారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకొని హోమంలో పాల్గొన్నారు. ఆలయ ఈఓ మాధవీలత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### శివాలయానికి శంకుస్థాపన



కారకంపాడు(మొవ్వ): మొవ్వ మండలం కారకంపాడులో సోమవారం శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత శ్రీముఖ లింగేశ్వరస్వామి ఆలయానికి శంకుస్థాపన చేశారు. రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సతీ సమేతంగా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక హోమం, పూజలు నిర్వహించారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొండి కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### రసాయన రహిత వ్యవసాయంపై మెలకువలు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): రసాయన రహిత వ్యవసాయంపై ప్రతి రైతు అవగాహన, మెలకువలు తెలుసుకోవాలని మండల వ్యవసాయాధికారి హెప్సిబారాణి తెలిపారు. మండల పరిధిలోని పెదకళ్లేపల్లిలో సోమవారం సాయంత్రం పొలంబడి కార్యక్రమం రైతు అరజా మల్లికార్జునరావు పొలంలో నిర్వహించారు. రసాయన రహిత వ్యవసాయంలో ఉపయోగాలు, మెలకువలు వివరించారు.

# ఆనందోత్సాహాలతో రక్షాబంధన్



ముదినేపల్లి మండలం వైవాక పాఠశాలలో విద్యార్థులకు రాఖీ కడుతున్న విద్యార్థినులు

ముదినేపల్లి రూరల్: మండలంలో రాఖీ పౌర్ణమిని సోమవారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు ఒకరికొకరు రాఖీ శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ సోదరభావాన్ని చాటుకుంటూ రాఖీలు కట్టుకున్నారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ పలు పాఠశాలల విద్యార్థులకు రాఖీలు పంపిణీ చేశారు. కూటమి నేతలు పాఠశాలల్లో వీటిని విద్యార్థులకు అందజేశారు.

**అక్కా తమ్ముళ్ల ఆత్మీయతకు చిహ్నం రాఖీ**

మండవల్లి: అక్కా తమ్ముళ్ల ఆత్మీయతకు సంకేతం రాఖీ. సోదరీ సోదరుల మధ్య అనుబంధానికి ప్రతీక ఈ పండుగ. మండవల్లిలో సోదరుడు సిద్ధూకు, సోదరి సాహి రాఖీ కట్టింది. జీవితాంతం తోడుగా ఉంటామని సోదరుడు భరోసా ఇచ్చే పండుగ నాడు సోదరి సాహికి సోదరుడు సిద్దూ భరోసా ఇచ్చాడు.

**పామర్రులో..**

పామర్రు: శ్రావణ పౌర్ణమి సందర్భంగా సోమవారం పలు చోట్ల రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏఎస్‌ఎం హైస్కూల్లో విద్యార్థులకు సోదర భావానికి గుర్తుగా వారి తరగతి విద్యార్థులకు రాఖీలు కట్టారు. అనంతరం మిఠాయిలను పంచుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఎం హైస్కూల్ ప్రిన్సిపాల్ ఏ పూర్ణచంద్రారెడ్డి, హెచ్‌ఎం శామ్యూలు పాల్గొన్నారు.

**శ్రావణ పౌర్ణమి పూజలు**

స్థానిక శ్రీ పర్వత వర్ధనీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా రుద్రాభిషేకం, అమ్మవారికి లలిత సహస్ర నామాలు, కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని రాపర్లలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో అభిషేకాలు చేశారు. నాగవల్లీలతో పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



పామర్రులో రాఖీలను కడుతున్న చిన్నారులు

## సమావేశానికి హాజరుకాని అధికారులతో సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్

పామర్రు: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశానికి హాజరు కాని అధికారులతో సమీక్ష ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ స్థానిక ఎంపీపీ చాంబర్‌లో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సమావేశానికి ఏ కారణం చేత హాజరు కాలేక పోయారనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో సమావేశానికి హాజరుకాకుంటే తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

### ప్రముఖ కవి వెంకటేశ్వరరావు మృతి



వెంకటేశ్వరరావు (ఫైల్)

కైకలూరు: ప్రముఖ కవి, సాహితీవేత్త మండవల్లి మండలం పులపర్రు గ్రామానికి చెందిన మోరు వెంకటేశ్వరరావు (80) సోమవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన గ్రామీణ వైద్యుడిగా, పులపర్రు పీఏసీఎస్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. 1987లో ఆయన స్వయంగా జనం మారాలి నాటకం రచించి, నటనతో పాటు దర్శకత్వం వహించారు. కొల్లేరు ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు. ఇటీవల కాలంలో ఆయన రచించిన కొల్లేరు కవి సంకీర్తనలు పుస్తకం ఆవిష్కృతమైంది. కృష్ణా జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. సాహితీ మిత్రులు కైకలూరు ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. పలు పత్రికల్లో ఆయన రచించిన కవితలు అచ్చయ్యాయి. ఆయన మృతి పట్ల కైకలూరు సాహితీ మిత్రుల కార్యదర్శి చింతపల్లి వెంకటనారాయణ, కొల్లేరు పెద్దలు, రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

## గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగునకు కృషి

**ఎంపీపీ గద్దే పుష్పరాణి**



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఐ నాగబాబు, వేదికపై ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీడీఓ

గుడివాడరూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగునకు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీపీ గద్దే పుష్పరాణి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను వివరించారు. ఆర్‌ఐ నాగబాబు కార్యాలయానికి వివిధ రెవెన్యూ సేవలకు అర్జీలు దాఖలు చేసిన వారికి అసౌకర్యం లేకుండా వెంటనే సేవలందిస్తామన్నారు. విద్యుత్ ఏఈ సురేష్‌బాబు మాట్లాడుతూ విద్యుత్ కోతలు లేకుండా మండలవాసులకు విద్యుత్ అందిస్తున్నామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో క్లోరినేషన్ చేసిన నీటిని ప్రజలకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అందుబాటులో ఉండటం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, అటువంటి వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ, ఎంపీడీఓ వెంకటరమణ, మండల పరిషత్ ఏఓ త్రినాధ తిరుమలరావు పాల్గొన్నారు.

### ఐదుగురు జూదరుల అరెస్టు

తోట్లవల్లూరు: పేకాట శిబిరంపై పోలీసులు దాడి జరిపిన ఘటన మండలంలోని దేవరపల్లిలో జరిగింది. గ్రామ శివార్లలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్‌ఐ ఎం.అర్జునరాజు ఆదివారం అర్ధరాత్రి దాడి జరిపారు. ఈ దాడిలో ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకోవటంతోపాటు రూ. 6,500 స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

## యూరియా సరఫరా చేయాలి

ముదినేపల్లి రూరల్ : వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో యూరియా సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం సార్వా వరి చేలల్లో కలుపులు తీసి, ఎరువులు వేసేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. ఈ తరుణంలో యూరియా లేకుండా ఇతర ఎరువులు వినియోగించడం సాధ్యపడదు. గతంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా యూరియా, కాంప్లెక్స్ ఎరువులను విక్రయించేవారు. ఈ ఏడాది ఈ కేంద్రాల్లో ఎరువులు విక్రయించటం లేదు. దీంతో రైతులు ప్రైవేటు డీలర్లపై ఆధారపడాల్సి వస్తోంది. దీనిని సాకుగా తీసుకున్న డీలర్లు యూరియాకు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు. ఒక్కో యూరియా బస్తాకు అదనంగా రూ.50 వసూలు చేయడంతో పాటు అవసరం లేని ఎరువులను యూరియాతో కలిపి తీసుకోవాలంటూ బలవంతంగా అంటగడుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మండలానికి యూరియా అధిక మొత్తంలో సరఫరా చేయడంతో పాటు రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం

రావర్ల(పామర్రు): పామర్రు మండలం రావర్లలో గణ్యశ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకాలను చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కాకర్ల మాధవి ఆధ్వర్యంలో పూజాధికాలను జరిపించారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో భక్తులు కాకర్ల బలరామమూర్తి, వీర వెంకట్రావ్, కె.శివయ్య, అర్చకుడు భార్గవ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం




కలిదిండి మార్కెట్ యార్డులో ఫొటోగ్రాఫర్లకు సన్మానం

కలిదిండి(కైకలూరు): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని కలిదిండిలో ఫొటో గ్రాఫర్లు వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలం యూనియన్ గౌరవాధ్యక్షుడు కె.విక్టర్ బాబు మాట్లాడుతూ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించామన్నారు. ప్రస్తుత టెక్నాలజీకి అనుగుణంగా ప్రతి ఫొటోగ్రాఫర్ నడుచుకోవాలని సూచించారు. పనిలో వృత్తి నైపుణ్యాన్ని అలవర్చుకుంటే మంచి ఫొటోగ్రాఫర్‌గా గుర్తింపు పొందవచ్చని అన్నారు. కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ ఫొటోగ్రాఫర్ విక్టర్ బాబు, మాజీ అధ్యక్షుడు సిద్దాబత్తుల వెంకట శ్రీనివాసరావు, గరికి ముక్కుల జోసెఫ్, మండల యూనియన్ నూతన అధ్యక్షుడు ప్రసాద్‌లకు సభ్యులు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఇమ్మానేని నాగ ప్రసాద్, సెక్రటరీ ఇమ్మానేని అయ్యన్న, కోశాధికారి కడగాని రమేష్, సింగవరపు ఇమ్మానుయేలు, కలిదిండి మండలం ఫొటోగ్రాఫర్స్ సభ్యులు పాల్గొన్నారు.

### బాలికను వేధించిన యువకుడికి జైలు

గుడ్లవల్లేరు: బాలికను వేధించిన కేసులో గుడ్లవల్లేరు మండలం కొత్తవరానికి చెందిన వీరంకి ప్రదీప్ రత్నకుమార్ అనే యువకుడికి జైలుతో పాటు జరిమానాను మచిలీపట్నం పోక్స్ కోర్టు విధించింది. ఈ విషయాన్ని సోమవారం గుడ్లవల్లేరు ఎస్‌ఐ జి.సత్యనారాయణ విలేకరులకు తెలిపారు. కొతవరంలో ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికను కొంత కాలంగా రత్నకుమార్ వెంబడించి అసభ్య పద జాలంతో మాట్లాడుతూ వేధిస్తున్నాడని పేర్కొన్నారు. దీంతో రత్నకుమార్‌కు ఆరు నెలల జైలుతో పాటు రూ.4వేల జరిమానాను కోర్టు విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## శిక్షణ తరగతులను సద్వినియోగించుకోండి



శిక్షణ తరగతులను హాజరై రిజిస్టర్లు పరిశీలిస్తున్న సీతామహాలక్ష్మి

గూడూరు: బోధనలో సులువైన పద్ధతులపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడానికి నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను ఉపాధ్యాయులు సద్వినియోగించుకోవాలని సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా ఉర్దూ ఏఏఎంఓ జి.సీతామహాలక్ష్మి కోరారు. గూడూరు నగరంపేటలో నిర్వహిస్తున్న ఉర్దూ స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. మాధ్యమం ఏదైనా విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన జరగాలన్న లక్ష్యంతో కాంప్లెక్స్ తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. గూడూరు, పామర్రు, మొవ్వ మండలాలకు చెందిన ఉర్దూ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ తరగతులలో కాంప్లెక్స్ చైర్మన్ షేక్ అలీ, ఏఎల్‌ఎస్ కో ఆర్డినేటర్ ఒడుగు రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### శ్రీబాల పార్వతీ అమ్మవార్లకు శత సహస్ర గాజుల అలంకరణ



టేకుపల్లి(మోపిదేవి): మండలంలోని టేకుపల్లి గ్రామంలో ఉన్న శ్రీ బాల పార్వతీ సమేత రామేశ్వరస్వామివారి దేవస్థానంలో అమ్మవారికి శత సహస్ర గాజుల అలంకరణ నిర్వహించారు. శ్రావణ పూర్ణిమ సందర్భంగా సోమవారం ఉదయం అమ్మవారికి అష్టోత్తర నామాలతో ప్రత్యేక పూజలు, స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు సమర్పించిన గాజులతో శ్రీ బాల పార్వతీ అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో అలంకరించారు. సాయంత్రం అమ్మవారికి సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### వైఎస్సార్ సీపీ నేత సత్యనారాయణ మృతి



సత్యనారాయణ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: మండవల్లి స్టేషన్‌రోడ్డులో వైఎస్సార్ సీపీ నేత, పంచాయతీ మాజీ సభ్యుడు బోయిన సత్యనారాయణ మృతికి మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం స్టేషన్ రోడ్డులోని సత్యనారాయణ నివాసం వద్ద ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూల మాల వేసినివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

### కృష్ణాలయం వద్ద అన్నసమారాధన



మండవల్లి శ్రీ కృష్ణాలయం వద్ద అన్నసమారాధన

మండవల్లి: మండవల్లిలో నిర్మించిన శ్రీ కృష్ణాలయం వద్ద సోమవారం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. మండవల్లి, కొర్లపాడు, గన్నవరం, మొఖాసాకలవపూడి, పెరికెగూడెం, లింగాల, కానుకొల్లు తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, యాదవ ప్రముఖులు, పెద్దలు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణుని ఆశీస్సులు అందరికీ ఉండాలి



మండవల్లి కృష్ణాలయంలో స్వామి ప్రతిష్ఠలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: శ్రీకృష్ణుని ఆశీస్సులు ప్రతిఒక్కరికీ ఉండాలని మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండవల్లిలో నిర్మించిన శ్రీకృష్ణ మందిరం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన సోమవారం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్ (రాము), ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, మెండా సురేష్, బొమ్మనబోయిన గోకర్ణ, గుడివాడ మురళీకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు నాయన బాబు, పరింకాయల వెంకటేశ్వరరావు, గుడివాడ చిట్టిబాబు, ఆకుల రంగారావు, ఎస్ వెంకటేశ్వరరావు, రాజా, వీరాంజనేయులు, వెంకన్న పాల్గొన్నారు.

**విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్సీ**

మండవల్లిలో నిర్మించిన శ్రీ కృష్ణాలయం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ సోమవారం పాల్గొన్నారు. ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, మెండా సురేష్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణుని విగ్రహానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ

## గుడ్లవల్లేరు ఫార్మశీ విద్యార్థుల ప్రతిభ



విజేతలతో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణరావు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజీ విద్యార్థులు రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ డ్రగ్ డిస్కవరీ అండ్ క్లినికల్ ట్రయల్స్ అనే అంశంపై ప్రతిభను ప్రదర్శించారు. ఈ విషయాన్ని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 17న విజయవాడ కేవీఎస్ఆర్ సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో జాతీయ సదస్సును నిర్వహించారని పేర్కొన్నారు. ఈ సదస్సులో రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ డ్రగ్ డిస్కవరీ అండ్ క్లినికల్ ట్రయల్స్ అనే అంశంపై తమ విద్యార్థులు ఈ-పోస్టర్‌ను ప్రదర్శించారని తెలిపారు. ఈ పోటీలో థర్డ్ ఇయర్‌కు చెందిన జె.కాంక్షకు ప్రథమ బహుమతి, కె.తరుణ్‌కుమార్‌కు ద్వితీయ బహుమతి, ఎండీ కౌసర్ రబియాకు తృతీయ బహుమతి లభించిందని పేర్కొన్నారు. విజేతలను ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణరావుతో పాటు అధ్యాపకులు డాక్టర్ పి.రవీష, డాక్టర్ టి.బాలకృష్ణ, డాక్టర్ ఎస్‌కే అమీనాబీ, డాక్టర్ టి.ప్రశాంతి, డాక్టర్ టి.బాల కృష్ణ, బి.సత్యశ్రీ, డాక్టర్ ఎ.సాయిధాత్రి, డాక్టర్ వి.రజని, కె.పరిమళ అభినందించారు.

## విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న రామకృష్ణ

గుడివాడ టౌన్: వ్యాపార రంగంలో కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పూర్తి అవగాహన ఉండాలని క్వాలిటీ ఫీడ్స్ కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ టి.రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ఏఎన్నార్ కళాశాల్లో ఎంబీఏ విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రామకృష్ణ మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ తన ఉత్పత్తిని ఇతరులకు వివరించడం, దానిని వారికి విక్రయించేందుకు ఈ స్కిల్స్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ నైపుణ్యం ఎంబీఏ చదివే ప్రతి విద్యార్థికీ అవసరం అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, ఎంబీఏ విభాగాధిపతి ఎం. బి. సువర్చల పాల్గొన్నారు.

## ఆపత్కాలంలో ఉపయోగపడే పోస్టల్ ఇన్సూరెన్స్



గుడివాడ పోస్టాఫీస్‌లో చెక్కును అందజేస్తున్న అధికారులు

గుడివాడ టౌన్: ఆపత్కాలంలో పోస్టల్ ఇన్సూరెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని పోస్టాఫీస్ సూపరింటెండెంట్ చెల్లా అప్పారావు అన్నారు. ప్రమాదంలో గాయపడి పాక్షికంగా అంగవైకల్యం పొందిన వ్యక్తికి స్థానిక పోస్టల్ కార్యాలయంలో సోమవారం రూ.6.50 లక్షలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన షణ్ముఖగుప్తా గ్రూప్ యాక్సిడెంట్ గార్డు పాలసీ ద్వారా రూ.396 ప్రీమియం చెల్లించి అతి కొద్ది సమయంలో ప్రమాదవశాత్తు పాక్షికంగా అంగవైకల్యం పొందారన్నారు. దీనికి గాను ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్, బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో ఈ ప్రమాద బీమా మొత్తాన్ని అందజేశామన్నారు. పోస్ట్ పేమెంట్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ పి. గణేష్, మేనేజర్ పి.కిషోర్ పాల్గొన్నారు.

## ఫీవర్ సర్వే పకడ్బందీగా చేయాలి



ఫీవర్ సర్వేను పరిశీలిస్తూ ఆరా తీస్తున్న మున్సిపల్ కార్యాలయం ఉద్యోగి, ఏఎన్‌ఎంలు

పెడన: పట్టణంలో ఫీవర్ సర్వే పకడ్బందీగా చేయాలని, జ్వరాలు ఉన్న పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేసేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య ఆదేశాలు జారీ చేశారు. దీంతో వార్డు సచివాలయాల్లోని సిబ్బంది ఉరుకులు పరుగులు తీస్తున్నారు. వీరిపై మున్సిపల్ కార్యాలయంలోని వివిధ విభాగాలకు చెందిన విభాగాధిపతులు సీనియర్ అసిస్టెంట్లను, జూనియర్ అసిస్టెంట్లను నియమించడంతో సచివాలయ ఉద్యోగులు సర్వే చేస్తున్నదీ లేనిదీ వారు పరిశీలిస్తున్నారు. ఇంటి పరిసరాలను కూడా పరిశీలించి పరిశుభ్రం చేయిస్తున్నారు. గత నాలుగైదు రోజులుగా ఇదే పనిలో సచివాలయ ఉద్యోగులు నిమగ్నమయ్యారు. సోమవారం పట్టణంలోని తొమ్మిది సచివాలయాల పరిధిలో వార్డు శానిటరీ కార్యదర్శులతో పాటు ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, వార్డు అడ్మిన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, మున్సిపల్ కార్యాలయ ఉద్యోగులు కూడా సర్వేలో పాలుపంచుకున్నారు.